

రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ 3 లో..


# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784



## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.**

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.

**9100900918**
**9100900931**



ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | మంగళవారం | 15 - 07- 2025 | సంపుటి : 1 | సంచిక : 43 | పేజీలు : 8 | వెల : 4/-




# వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు

- ఎపి ప్రాజెక్టులను పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలు
- వ్యవసాయారంగాన్ని అభివృద్ధి చేయడం కాంగ్రెస్ లక్ష్యం
- పాలేర్ రిజర్వాయర్ నీటిని విడుదల చేసిన భట్టి, పొంగులేటి

**ఖమ్మం- నేటి ప్రభాత సూర్య :**

కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో శ్రీశైలం పైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా

మిగతా 2వ పేజీలో..

# జలవివాదంపై కేంద్రం చొరవ

- ఇరు రాష్ట్రాల సిఎంలతో 16న పాటిల్ భేటీ
- చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు ఆహ్వానం
- నేడు ఢిల్లీ వెళ్లనున్న ఎపి సిఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు,

మిగతా 2వ పేజీలో..



## కృష్ణా, గోదావరి జలాల్లో వాటాకు పట్టు

- 16న జరిగే సమావేశంపై తెలంగాణ కసరత్తు



2 లో..

## హైకోర్టు సిజెగా జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్

- కొలీజియం సిఫార్సులతో రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు



## గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

- కొత్తగా ముగ్గురు గవర్నర్ల నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి ముర్ము
- ముగిసిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ పదవీకాలం

3 లో..



## చీఫ్ జస్టిస్ గవాయ్‌కు స్వల్ప అస్వస్థత

- ఢిల్లీలోని ఆస్పత్రిలో చేరిన జస్టిస్ గవాయ్

2 లో..

# గోదావరి నీళ్లు తేవడం

## గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు..



- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- పేదలకు సన్నబియ్యం ఊసే ఎత్తలే
- కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ
- కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి
- బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులకే ప్రాధాన్యం
- రైతులకు రుణమాఫీ...బోనస్ ఇచ్చిన ఘనత మాది
- కెసిఆర్ కట్టిన కాళేశ్వరం..కూలేశ్వరంగా మారింది
- ఇందుకు వారిని అక్కడే ఉరితీసినా నష్టం లేదు
- నల్లగొండ జిల్లా తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ
- బిఆర్ఎస్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన సిఎం రేవంత్



**నల్గొండ- నేటి ప్రభాత సూర్య :**

బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి..గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వంలోని పెద్దలు చేయ లేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. రూ. 34. 20 కోట్ల విలువైన పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధమని తెలిపారు. తెలంగాణలో కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల

మిగతా 2వ పేజీలో..

# కాలంకాదు.. కాంగ్రెస్ కాటేస్తోంది

- కాళేశ్వరం ఎత్తిపోతలపై తీవ్రనిర్లక్ష్యం
- రైతులు ప్రశ్నిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు

కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని బిఆర్ఎస్ నేత కెటిఆర్ మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3 లో..





## ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం ముఖ్యం

- విభేదాలను వివాదాలుగా మార్చకూడదు
- చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీతో జైశంకర్ భేటీ

2 లో..



## విద్వేష పూరిత ప్రసంగాల కట్టడికి చర్యలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

విద్వేషపూరిత ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని కూడా స్పష్టం చేసింది.

2 లో..



## నిమిష ప్రియ కేసులో చేతులెత్తేసిన కేంద్రం

- ఉరిశిక్ష ఆపేందుకు చేయగలిగిందేమీ లేదు
- సుప్రీంకు వివరించిన కేంద్ర ప్రభుత్వం
- బ్లడ్మనీ ఆప్షన్‌పైనే ఆశలు పెట్టుకున్న కుటుంబం

3 లో..

# షోషకాహార తెలంగాణే లక్ష్యం

- సమిష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యం
- అంగన్వాడీ సేవలను మరింత మెరుగు పరుస్తాం
- మహిళా శిశు సంక్షేమ శాఖ సమావేశంలో మంత్రి సీతక్క

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పని చేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్య పడుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు దేశానికే ఆదర్శంగా తెలంగాణ అంగన్వాడీ కేంద్రాలను తీర్చి దిద్దుతామనివెల్లడించారు. తెలంగాణ రైజింగ్ -2047 డాక్యుమెంట్ కు అనుగుణంగా అంగన్వాడీ సేవలను మరింత మెరుగు పరుస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్ర స్థాయి సమావేశం బేగంపేటలోని టూరిజం ప్లాజా వేదికగా సోమవారం నాడు ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మంత్రి సీతక్క అధ్యక్షత



మిగతా 2వ పేజీలో..

# అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

## సన్మాన సభలో రామచంద్రరావు సూచన

**నల్లగొండ- నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలన్నారు. బిజెపి చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా చౌటుప్పల్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం

మిగతా 2వ పేజీలో..



# కవితక్క వార్తలకు నమస్తే

- మాజీ సీఎం కేసీఆర్ కూతురు వార్త కవర్ చేయని నమస్తే తెలంగాణ
- బీఆర్ఎస్ స్టాండ్ నమస్తే తెలంగాణ ద్వారా క్లియర్‌గా చెప్పేసిందా?
- కవితతో బీఆర్ఎస్‌కు సంబంధం లేదని తేల్చేసినట్టేనా?

**హైదరాబాద్ -నేటి ప్రభాత సూర్య :**

వారాంతంలో వార్తలకు కొరత ఉంటుంది. ఇచ్చిన వార్తలనే మళ్లీ ప్లే చేయాల్సిన పరిస్థితి మీడియా ఛానళ్ల పరిస్థితి. ఏవో స్పెషల్ ప్రోగ్రామ్స్, డిబేట్లతో సమయం గడపిస్తుంటారు. ఈ ఆదివారం కూడా ఉదయం కొద్దిసేపటి వరకు అదే పరిస్థితి ఉంది. కానీ ఆ తర్వాత అంతా మారిపోయింది. మీడియా ఛానళ్లకు కావాల్సిన, నడాపాల్సినంత కంటెంట్ దొరికేసింది. అదే తీన్మార్ మల్లన్న ఆఫీసుపై జాగృతి కార్యకర్తల దాడి. అలాగే ఇవాళ ఉదయం వెలువడ్డ న్యూస్ పేపర్లలోనూ ఈ వార్తలకు ప్రాధాన్యం దక్కింది. ఐతే ఒక్క నమస్తే తెలంగాణ మాత్రం కవిత ఇష్యూని కనీసం చిన్న వార్తగానైనా కవర్ చేయలేకపోయింది. ఎందుకంటారు? దీని వెనుక ఉన్న నిగూఢ అర్థం



మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ హైకోర్టు సిజెగా జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్

**కొలీజియం సిఫార్సులతో రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు**



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం త్రిపుర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా సేవలం దిస్తున్న జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేశారు. కొలిజియం చేసిన సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించడంతో ఈ బదిలీ అమలులోకి వచ్చింది. సోమవారం విడుదల చేసిన కేంద్ర నోటిఫికేషన్ ప్రకారం నాలుగు రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు నియమించారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌కు ఇది ఒక కీలక బాధ్యత. 2023 ఏప్రిల్ 11న ఆయన త్రిపుర హైకోర్టు సీఎంజేగా నియమితులయ్యారు. ఆయనకు పుట్టిన కోర్టుగా జార్ఖండ్ హైకోర్టు గుర్తింపు ఉంది. న్యాయరంగంలో ఆయనకు ఉన్న అనుభవం, తీర్పుల్లో ఆయన చూపిన నిష్పక్షపాతత, న్యాయ శాస్త్రంపై గల లోతైన అవగాహన తెలంగాణ న్యాయవ్యవస్థకు తోడ్పాటును అందించనుందని న్యాయవర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

## చీఫ్ జస్టిస్ గవాయ్‌కు స్వల్ప అస్వస్థత

**ఢిల్లీలోని ఆస్పత్రిలో చేరిక**



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే అతడిని ఆస్పత్రిలో చేర్చారు. తీవ్ర ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన చికిత్సకు స్పందిస్తున్నట్లు తెలిపాయి. ఒకటి,రెండు రోజుల్లో విధులకు హాజరవుతారని పేర్కొన్నాయి. 12న హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ యూనివర్సిటీ- స్నాతకోత్సవంలో జస్టియ్ గవాయ్ పాల్గొన్నారు. ఆ తర్వాతే ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది. అదేరోజు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ' భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్' అనే అంశంపై జస్టిస్ గవాయ్ ప్రసంగం చేశారు. బాబాసాహెబ్ డా.బీఆర్ అంబే ద్కర్ -రాజ్యాంగ సభ- భారత రాజ్యాంగం' పేరిట పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. అక్కడి నుంచి ఢిల్లీ చేరుకున్నారు.

## విద్వేష పూరిత ప్రసంగాల కట్టడికి చర్యలు

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం**

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** విద్వేషపూరిత ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా చూడాలని కూడా స్పష్టం చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా.. విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది. వాక్ స్వాతంత్ర్య విలువను పౌరులు తెలుసుకోవాలని, ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలీపై ఫిర్యాదు చేసిన వజాహత్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. విద్వేష ప్రసంగాలు చేసే వారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావట్లేదని పేర్కొంది.

## కవితక్క వార్తలకు నమస్తే!

మొదటిపేజీ తరువాయి..

ఏమిటీ? పార్టీ కవితను పక్కన పెట్టేసినట్టేనా? తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం ఇప్పుడు హాట్ టాపిక్. అన్ని పార్టీలు, అందరు నేతలు బీసీ రిజర్వేషన్ల అంశంపైనే మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తన జాగృతి ద్వారా కూడా బీసీ నినాదం అందుకున్నారు. అటు తీన్మార్ మల్లన్న కూడా బీసీ ఉద్యమం అంటున్నారు. ఈక్రమంలో తీన్మార్ మల్లన్న కవితపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో జాగృతి కార్యకర్తలు క్యూస్ ఆఫీసుపై దాడులకు దిగారు. ఈ ఘటనలో మల్లన్న గన్ మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ దాడితో అప్పటివరకు స్తబ్ధుగా నడిచినవార్తలు కాస్త ఊపందుకున్నాయి. మీడియా ఛానళ్లు అన్ని దాడి ఘటనను గంటల కొద్ది నడిపేశాయి. ఇక ఈ అంశంపై కవిత, మల్లన్న ఒకరినొకరు విమర్శలు చేసుకోవడం పోలీస్ స్టేషన్లు ఫిర్యాదులు అందుకోవడం అన్ని జరిగిపోయాయి. ఈ వార్తల ప్రభావం సోమవారం కూడా కొనసాగింది. ఐతే రాష్ట్రంలో ఉన్న అన్ని పత్రికలు ఉదయం మల్లన్న ఆఫీసు పై దాడి కవిత ఫిర్యాదు అంశాన్ని కవర్ చేశాయి. కొన్ని పత్రికలు మెయిన్ పేజీ వార్తను కూడా చేశాయి. కానీ నమస్తే తెలంగాణ మాత్రం అసలు ఈ అంశాన్ని టచ్ కూడా చేయలేదు. కవితపై ఓ ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేశారని కూడా రాయలేదు. మల్లన్న అంటే బీఆర్ఎస్ పార్టీకి, నమస్తే తెలంగాణ దూరంగానే ఉంటాయి. కానీ కవిత అలా కాదు. బీఆర్ఎస్ నేతలకు సంబంధించి ఏ అంశాన్నైనా ఆ పార్టీ పెద్ద ఎత్తున కవర్ చేస్తుంది. కానీ కవిత విషయంలో అలా జరగలేదు. కనీసం ఓ మూలన చిన్నగా కూడా కవర్ చేయలేకపోయింది. నమస్తే తెలంగాణ బీఆర్ఎస్ పార్టీ అధినేతకు చెందిన పత్రిక. ఇది అందరికీ తెలిసిన విషయమే. బీఆర్ఎస్ పార్టీ స్టాండ్ ఏంటో.. అదే ఆ పత్రిక ఫాలో అవుతుంది. నమస్తే తెలంగాణ ఒక్క అక్షరం కూడా రాయకపోవడం ఆ పార్టీ ఆదేశాల మేరకే జరిగింది అని భావిస్తున్నారు. అన్ని పేపర్ల లాగా అనుకుంటే కనిసం చిన్ని వార్తగానైనా వార్త వేయాల్సింది.కానీ నమస్తే తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ తో కవితకు సంబంధం లేదనే విషయం తెలియజేయడానికే..పక్కన పెట్టిందా? అనే చర్చజరుగుతోంది. కవిత విషయంలోనూ ఆ పార్టీ నేతలు ఇప్పటివరకు ఎవరు స్పందించలేదు.ఇంత జరుగుతున్నా కేటీఆర్, హరీశ్‌రావు సహా ఇతర నేతలెవరూ.. స్పందించలేదు. అలాగే పార్టీ సోషల్ మీడియాలో కూడా కవితకు సపోర్ట్ గా పోస్టులు కూడా కనిపించలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీతో కవిత తెగతెంపులు చేసుకునేం దుకు పూర్తిగా సిద్ధమైనట్టు కనిపిస్తోందంటున్నారు విశ్లేషకులు.

# ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం ముఖ్యం

- విభేదాలను వివాదాలుగా మార్చకూడదు
- చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీతో జైశంకర్ భేటీ

**బీజింగ్- నేటి ప్రభాత సూర్య డెస్క్:**

దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని భారత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ చైనాకు సూచించారు. విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ-.. సంఘర్షణగా మారకూడదని జై శంకర్ అన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన.. ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టియాంజిన్ వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకోవాలని, మంచి ఫలితాలు రావాలని కోరుకున్నట్లు చెప్పారు. ఇరుదేశాల విదేశాంగశాఖ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ.. భారత్, చైనా మధ్య స్థిరమైన సంబంధాలు ప్రపంచానికే మేలు చేస్తాయని తెలిపారు. మంగళవారం జరగనున్న ఎస్‌సీవో సమావేశంలో ముఖ్యంగా తీవ్రవాదం, వేర్పాటువాదం, ఉగ్రవాదం అనే అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలన్న కృతనిశ్చయంతో భారత్ ఉందని పునరుద్ఘాటించారు. విదేశాంగశాఖ మంత్రిగా ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత వాంగ్ యీ పైనా ఉందని జైశంకర్ తెలిపారు. నిర్మాణాత్మకమైన, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎస్‌సీవోలో చర్చలు సాగుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. అక్టోబర్ 2024లో ఇరుదేశాల నేతల సమావేశం జరిగిన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయి. బాధ్యతాయుతంగా మన రెండు దేశాలు దానిని కొనసాగించాలి. ఇటీ-వల కాలంలో పలు అంతర్జాతీయ వేదికల్లో కలిసేందుకు, వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు అవకాశం లభించింది. ఇలా క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు- చేసుకొని పరస్పరం చర్చించుకుంటే రెండు దేశాలకూ మేలు జరుగుతుందని భారత్ ఆశిస్తోంది. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఐదేళ్ల విరామం తర్వాత ప్రఖ్యాత మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమైనందుకు సంతోషంగా ఉంది. ఈ విషయంలో చైనాకు కృతజ్ఞతలు చెబుతున్నాని



అన్నారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత 9 నెలల్లో కీలక పురోగతి సాధించాం. సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు తీసుకున్నాం. ద్వైపాక్షిక సంబంధాలు సజావుగా సాగుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. ఉద్రిక్తతలను తగ్గించడంతో సహా సరిహద్దుకు సంబంధించిన ఇతర అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళ్తే.. త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

## వెన్నాడుతున్న కెసిఆర్ పాలనా వైఫల్యాలు

మొదటిపేజీ తరువాయి..

నిలిచిందని చెప్పారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేశామని తెలిపారు.గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటకు పెట్టు-బడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు- ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదని భట్టి విక్రమార్కమండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే.. వ్యవసాయం, కరెంటు-, ప్రాజెక్టులు అని అన్నారు. ఎపి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే..మాజీ సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఆనాడు తప్పిదాలు చేసిందంటే కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు అని తెలియజేశారు. తప్పులు చేసిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టు-కుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టు-కుపోయిందని.. దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్దాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని నొక్కిచెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు అన్నదాతల ఖాతాలో వేశామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరువిడుదల చేస్తామని తెలియజేశారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నామని, రైతుభరోసా రైతులకు ఎకరాలకు రూ.12 వేలు అందించామని, రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- జమ చేశామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాళ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## గోదావరి నీళ్లు తేవడం..

మొదటిపేజీ తరువాయి..

మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి విపులీకరించారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్‌షాపులు తెరిచారంటూ వ్యంగ్యంగా అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వ లేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. రైతుకు బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 18 నెలల్లో మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రవేశపెట్టి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 6, 500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. . నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగు తున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేశామని.. రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చామని.. వ్యవసాయం దండగ కాదు.. పండగలా చేశామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రైతు రాజు అయినప్పుడే ఇందిరమ్మ ఆత్మశాంతిస్తుందని ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం సహాయక సంఘాలను పట్టించుకో లేదు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్‌బంకులు అప్పగించాం. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు అగుడుల వ్యక్తి నన్ను అడ్డుకుంటానని అంటున్నాడు. గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం. ఒక్కసారి అడ్డుకుని చూడు, మా దామన్న చూసుకుంటాడని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ తదతరులు పాల్గొన్నారు.

## జలవివాదంపై కేంద్రం చొరవ

మొదటిపేజీ తరువాయి..

ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు. చంద్రబాబు బనకచర్ల ప్రతిపాదనలతో గోదావరి జలాలపై రచ్చ సాగుతోంది. ఈ క్రమంలో కేంద్రం ఈ భేటీ ఏర్పాటు చేయడం గమనార్హం. అయితే రేవంత్ ఢిల్లీ వెళతారా లేదా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఇకపోతే ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజులు ఢిల్లీలో పర్యటించనున్నారు. మంగళ, బుధవారాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభ, సీఐఐ బిజినెస్ మీట్‌లో చంద్రబాబు పాల్గొననున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వశాఖతో సీఎం చర్చలు చేయనున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.30కు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. బుధవారం కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. నార్త్ బ్లాక్‌లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఎల్లుండి సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 8 మంది మంత్రులు, అధికారుల బృందం ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళ్లనుంది. ఈనెల 30 వరకు ఈ బృందం సింగపూర్‌లో పర్యటించనుంది.

## అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

మొదటిపేజీ తరువాయి..

పలికాయి. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. భాజపా ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణ యుగం తెస్తుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని ఇబ్బందులు పెడుతోంది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా భాజపా వైపు చూస్తున్నారని రామచందర్‌రావు అన్నారు.

## షోషకాహార తెలంగాణే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..

వహించారు. ఈ సమావేశంలో పోషకారంపై పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సీఎఫ్‌టిఆర్‌ఐ (మైసూర్), ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళా సభ, హర్మన్, బాల రక్షభారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోషకాహారం అందించడం లో లైన్ డిపార్ట్ మెంట్లుగా వ్యవహరిస్తున్న పలు సంక్షేమ శాఖలు, సివిల్ సప్లైస్, విద్యా శాఖ, టీజీ ఫుడ్స్, సెర్ప్, ఐ అండ్ పీఆర్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ విలువైన అభిప్రాయలు తెలియ చేశారు. వారి అభిప్రాయలను, అనుభవాలను, ఆలోచనలను ఆసక్తిగా విన్న మంత్రి సీతక్క వారి సూచనలతో తెలంగాణ పోషకాహార ప్రణాళిక రూపొందిస్తామని ప్రకటిం చారు. అంగన్వాడీ లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీ లీటర్ల విజయ పాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణ ధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..పోషకాహార తెలంగాణ నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించినట్లు- వెల్లడించారు. నిపుణుల అభిప్రాయాలను, అనుభవాల ఆదారంగా పోషణ తెలంగాణ కోసం కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణ లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ప్రజా ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాల సేవల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడీల్లో ఎన్నో పోషకాలున్న కోడిగుడ్డు సరఫరాను నిలిపి వేయగా..తెలంగాణలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు- చెప్పారు. నిపుణుల సలహ మేరకు అన్ని వయసుల వారికి పౌష్టికాహారం అందించే అంశం పరిశీలనలో ఉందన్నారు. అన్ని రంగాల్లో ముందజలో ఉన్న తెలంగాణలో పోషకార లోపంతో పిల్లలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు- వెల్లడించారు.పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు- తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహాయక బృందాల సహకారాన్ని తీసుకుంటామన్నారు. అంగన్వాడీలపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచేలా సేవల నాణ్యత పెంచుతున్నామని చెప్పారు. అమ్మ ఒడి నుంచి చిన్నారులు అంగన్వాడి బడి లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అంగన్వాడీల్లో ఆహారంతో పాటు- అక్షరం, ఆరోగ్యం లభిస్తుందని పేరెంట్స్ కు తెలియ జెప్పాలని సూచించారు. ఇక నిర్మాణ సౌకర్యం లేని ప్రాంతాల్లో మొబైల్ అంగన్వాడీలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. నాక్, జెఎన్‌టీయూ వంటి సంస్థలు మోడల్స్ సిద్ధం చేస్తున్నట్లు- తెలిపారు. హైదరాబాద్ లో వలస కూలీల పిల్లలకు పౌష్టికాహారం అందించేలా మొబైల్ అంగన్వాడీలు నిర్వహిస్తామన్నారు. వారానికి కనీసం రెండు సార్లు అయా ప్రాంతాల్లో పోషకాహారన్ని అందిస్తామని తెలిపారు. ఇక అంగన్వాడీ కేంద్రాలను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తిని తెలిపిన నేపథ్యంలో అవసరమైన ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన చిన్నారులే కీలకమన్నారు. అందుకే అంగన్వాడి కేంద్రాల సేవలపై పూర్తి దృష్టి సారించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అంగన్వాడి సిబ్బంది స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తే ఫలితాలు మెరుగ్గా వస్తాయని పేర్కొన్నారు. మంత్రి సీతక్క ప్రత్యేకంగా పోషన్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన సీడ్స్ కిట్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. మొదటి విడతలో 4,500 అంగన్వాడి కేంద్రాలకు ఈ విత్తనాల కిట్లు పంపిణీ చేయనున్నట్లు- పేర్కొన్నారు. వీటిలో పాలకూర, తోటకూర, మెంతికూర, టమాట, వంకాయ, బెండకాయ విత్తనాలు ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో వీటిని పెంచి లబ్దిదారులకు వండి పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# అలనాటి నటి బిజ సరోజాదేవి కన్నుమూత

**తెలుగులో అగ్రహీరోలతో నటించిన సరోజ**

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :





మరో తార రాలిపోయింది. ఒక్కరోజు తేడాతో కోట జ్ఞాపకాలను మరువకుండానే నటి బి. సరోజాదేవి కన్నుమూశారు. సీనియర్ నటి, పద్మభూషణ్ గ్రహీత బి.సరోజాదేవి (87) కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో సరోజాదేవి ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్ వంటి దిగ్గజ నటులతో పలు సూపర్‌హిట్ సినిమాల్లో నటించారు. 1938లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 13 ఏళ్ల వయసులోనే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో అభిమానులను సొంతం చేసుకొన్నారు. 1955లో 'మహాకవి కాళిదాస' అనే కన్నడ సినిమాతో చిత్రసీమలోకి అడుగుపెట్టారు సరోజాదేవి. 'పెళ్లిసందడి' (1959)లో తెలుగులో అవకాశం వచ్చింది. దీనికంటే ముందు పాండురంగ మహత్యం, భూకైలాస్ ముందుగా విడుదలై గుర్తింపునిచ్చాయి. సీతారామ కల్యాణం (1961), జగదేకవీరుని కథ (1961), శ్రీకష్ణార్జున యుద్ధం (1963), దాగుడు మూతలు (1964), ఆత్మబలం (1964), శకుంతల (1966), దానవీర శూర కర్ణ (1978), అల్లుడు దిద్దిన కాపురం (1991) వంటి పలు తెలుగు సినిమాల్లో నటించారు. 1955 నుంచి 1984 మధ్య 29 ఏళ్ల పాటు- వరుసగా 161 సినిమాల్లో లీడ్‌రోల్‌లో నటించిన ఏకైక నటిగా సరోజాదేవి చరిత్ర సృష్టించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.




# రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ

**ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్**

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

రామాయణం, మహాభారతం మన జీవితాల్లో భాగమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'శ్రీమద్భాగవతం-పార్ట్1' చిత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ దీన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం చిత్రీకరణ రాష్ట్రానికి గర్వకారణం. రామోజీరావు ఫిల్మ్‌సిటీ-ని అద్భుతంగా నిర్మించారు. నేను యూనివర్సల్ స్టూడియో చూడలేదు. రామోజీ ఫిల్మ్‌సిటీ-.. దేశంలోనే ప్రత్యేకమైన స్టూడియో. ఇది తెలంగాణలో ఉందని చెప్పేందుకు గర్విస్తున్నా. శ్రీమద్భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు మూవీ టీమ్‌ను అభినందిస్తున్నా. నలభయేళ్ల క్రితం రామాయణం సీరియల్ అందరికీ చేరువైంది. కొవిడ్ సమయంలో మళ్లీ ఆ సీరియన్‌ను టెలికాస్ట్ చేస్తే ప్రపంచ రికార్డు సృష్టించింది. 2035లోపు తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దీనికోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటు-న్నాం. ఇందులో సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటు-ంది. నాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. 'శ్రీమద్భాగవతం పార్ట్-1' కూడా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నట్లు రేవంత్‌రెడ్డి అన్నారు.

# కృష్ణా, గోదావరి జలాల్లో వాటాకు పట్టు

**16న జరిగే సమావేశంపై తెలంగాణ కసరత్తు**

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతో పాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు-, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయన సూచనలతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు లేఖ రాశారు. ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టింది. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడి, కృష్ణా నీళ్లను ఏపీ యథేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించింది. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది. అటు గోదావరిపై తుమ్మిడిహెట్టిపై చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత పక్కనబెట్టింది. దానికి బదులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రూ. లక్ష కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ప్రకటనలో పేర్కొన్నారు.

# మెడికల్ ఆఫీసర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి -నేటి ప్రభాత సూర్య :

నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్ సి) లో 21 మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఒక సంవత్సర కాలపరిమితి కలిగిన పోస్టులకు దరఖాస్తులను అర్హత కలిగిన అభ్యర్థులు 18లోగా బయోడేటాతో సెల్ఫ్ అటెస్ట్‌తో కూడిన సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను రంగారెడ్డి జిల్లా మెడికల్ అధికారి కార్యాలయానికి పోస్టులో పంపాలని కోరారు. రంగారెడ్డి జిల్లా మెడికల్ అధికారి ఒక ప్రకటనలో తెలి పారు. దరఖాస్తు ఫాములు, నిబంధనలు www.rangareddy.telangana.gov.in. అధికారిక వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

# గోవా గవర్నర్‌గా అశోకగజపతి రాజు

- కొత్తగా ముగ్గురు గవర్నర్ల నియామకం
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి ముర్ము
- ముగిసిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ పదవీకాలం

న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :

రాష్ట్రపతి ద్రౌపదీముర్ము మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమించారు. గోవా గవర్నర్‌గా తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు. హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్‌ఘోష్ నియమితులయ్యారు. అలాగే తెలుగు రాష్ట్రానికి చెందిన గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం విశేషం. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హరియాణా గవర్నర్‌గా పనిచేసిన బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. అలాగే మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగర్ రావు పదవీకాలం కూడా గతంలోనే ముగిసింది. ఆయనకు మళ్లీ పొడగింపు ఇవ్వలేదు. ఇప్పుడు దత్తాత్రేయకు కూడా పొడగింపు లేదని స్పష్టమయ్యింది. ఇకపోతే విజయనగరం జిల్లా ప్రజలకు, రాష్ట్ర రాజకీయ వర్గాలకు పరిచయం అక్కర్లేని పేరు పూసపాటి అశోక్ గజపతిరాజు. విజయనగర సంస్థానాధీశుల వారసుడే అయినప్పటికీ రాచరికపు పోకడలకు దూరంగా ఉంటూ నిరాడంబర ప్రజానాయకుడిగా అశోకగజపతి రాజు గుర్తింపు పొందారు. నీతి, నిజాయతీలకు నిలువుటద్దంగా నిలిచారు. నమ్మిన సిద్ధాంతాలకు తుది దాకా కట్టుబడే నైజం అశోక్ సొంతం. విజయనగరం మహారాజు అయిన డాక్టర్ పీవీజీ రాజు కుమారుడైన అశోక్ గజపతి రాజు జిల్లా ప్రజలకు రాజుగారిగా చిరపరిచితులు. జిల్లా తెదేపా శ్రేణులు ఆయనను పెద్దాయనగా గౌరవించి ఆ పేరుతోనే సంభోదిస్తుంటాయి.



# నిమిష ప్రియ కేసులో చేతులెత్తేసిన కేంద్రం

- ఉరిశిక్ష ఆపేందుకు చేయగలిగిందేమీ లేదు
- సుప్రీంకు వివరించిన కేంద్ర ప్రభుత్వం
- బ్లడ్మనీ ఆప్షన్‌పైనే ఆశలు పెట్టుకున్న కుటుంబం

న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :



కేరళకు చెందిన నర్స్ నిమిష ప్రియకు యెమెన్‌లో పడిన మరణశిక్ష విషయంలో అన్ని దారులు మూసుకుపోయాయని కేంద్రం సుప్రీంకు తెలియచేసింది. ఉరిశిక్ష అమలుకు ఇంకా రెండురోజుల సమయమే ఉన్నందున, ఆ శిక్షను ఆపేందుకు ఇప్పుడు భారత్ వద్ద పెద్దగా మార్గాలేమీ లేవని కేంద్రం పేర్కొంది. ఇక మిగిలింది బ్లడ్ మనీ ఆప్షనే. అయితే అది ప్రైవేటు- సంప్రదింపు అని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. హూతీల పాలనలో యెమెన్ చట్టాల ప్రకారం.. నేరం రుజువైన తర్వాతకూడా దోషిని బాధిత కుటుంబం క్షమిస్తే శిక్ష తప్పుతుంది. ఆ కుటుంబం బ్లడ్‌మనీకి అంగీకరిస్తే అది సాధ్యమవుతుంది. ఈ విషయంలో నిమిష కుటుంబం.. బాధిత కుటుంబంతో సంప్రదింపులు కొనసాగిస్తోందని 'ది సేవ్ నిమిష ప్రియ ఆర్గనైజేషన్'సుప్రీంకోర్టుకు వెల్లడించింది. చెప్పుకోదగ్గ స్థాయిలో ధనాన్ని సేకరించింది. అయితే ఈ విషయంపై చర్చించేందుకు ఆ కుటుంబం, హూతీ యంత్రాంగం నిరాకరిస్తోంది. ఈ వ్యవహారం తమ గౌరవానికి సంబంధించినదిగా వారు చెప్తున్నారు. ఆ మొత్తం పెరిగితే వారి అభిప్రాయం మారుతుందో లేదో తెలియదు. ఇప్పటికైతే ఆ చర్చలు నిలిచిపోయాయని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టులో వెల్లడించారు. జులై 16న యెమెన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా హత్య కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న నిమిషను కాపాడేందుకు భారత ప్రభుత్వం వద్ద ఉన్న అవకాశాలు అతితక్కువని కేంద్రం తరఫున భారత అటార్నీ జనరల్ సుప్రీం ధర్మాసనానికి నివేదించారు.

# కాలంకాదు.. కాంగ్రెస్ కాటేస్తోంది

- కాళేశ్వరం ఎత్తిపోతలపై తీవ్రనిర్లక్ష్యం
- రైతులు ప్రశ్నిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :



కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో వచ్చిన నీళ్లు కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నార న్నారు. రైతులకు కోసం బీఆర్‌ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి కేటీఆర్ ఫైర్ అయ్యారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ 'కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్దాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్‌ఎస్ పాలనలో పండగ చేస్తే .. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరేగుతున్నది. బీఆర్‌ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ కింద 2001లో పూర్తయిన కాకతీయ వరద కాలువ 22 ఏళ్ల తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల మూలంగా 153కిలోమీటర్లు ప్రయాణించి చివరి ఆయకట్టు-కు చేరాయి. కానీ నేడు మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లుఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు శిక్ష వేస్తున్నది. కాంగ్రెస్ కుట్రలను చేధిస్తాం. తెలంగాణ రైతన్నలను కాపాడుకునేందుకు నిరంతరం పోరాడతాం' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మా బిల్లులు చెల్లించండి

**మన ఊరు మన బడి పథకం కాంట్రాక్టర్ల ఆందోళన.**

తెలంగాణ -నేటి ప్రభాత సూర్య:



తాము చేసిన పనులకు గాను అయిన బిల్లులను వెంటనే చెల్లించాలని మనఊరు మనబడి పథకంకింద పనిచేసిన కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన మన ఊరు మన బడి పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ విద్యా కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1000 స్కూళ్లకు పైగా మన ఊరు మన బడి పథకం కింద పలు రకాల అభివృద్ధి పనులు చేశామని వాటికి సంబంధించిన బిల్లులను ఈ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలు నుండి మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తాము ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతోరాష్ట్రవ్యాప్తంగా పదిమంది కాంటాక్టర్లకు పైగా ఆత్మహత్యకు పాల్పడ్డారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు రావాల్సిన బిల్లులకోసం నిత్యంఅధికారుల చుట్టూ కలెక్టర్ల చుట్టు తిరుగుతున్న ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని వాపోయారు. తమకు న్యాయం చేయాలని, తమ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ. 1000 కోట్లకు పైగా ప్రభుత్వం పిల్లలు ఇవ్వాల్సి ఉందని వారు గుర్తు చేశారు. అనంతరం విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలసంను కలిసి కాంట్రాక్టర్లు వినతిపత్రం అందజేశారు.

# మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం: బిజెపి

నల్లగొండ- నేటి ప్రభాత సూర్య :

మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్లలో ముస్లింలనుచేర్చడాన్ని అంగీకరించబోమన్నారు. భారత్‌లోనే కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలో కుటుంబ పాలన నడుస్తోందని రామచందర్ రావు ఆరోపించారు. కుటుంబ పాలనను పారదోలి మోదీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. మొదట యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వెళ్లారు. అనంతరం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పర్యటించారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లకు తను వ్యతిరేకం కాదని, మత పరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని రామచందర్ రావు అన్నారు.



# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తుర్కయంజాల్- నేటి ప్రభాత సూర్య :

భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డీసీసీబీ చైర్మన్, టె స్కాబ్ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరిత హారం కార్యక్రమం లో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య,మున్సిపల్ కమీషనర్ కె. అమరేందర్ రెడ్డి తో కలిసి మొక్కలను నాటారు. అనంతరం అయన మాట్లాడుతూ వర్షాకాలంలో మొక్కలు నాటి రాబోయే తరానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ప్రతీఒక్కరు సావూజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాం రెడ్డి,తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీకౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివ కుమార్, అయ్యప్ప దేవస్థానం కమిటీ సభ్యులుతుళ్ల నర్సింహగౌడ్,తాటి చెట్టు అశోక్ గౌడ్, పలుస శ్రవణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీ పాడుబడ్డ ఇంట్లో అస్థిపంజరం కలకలం

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

నగరంలోని ఓ ఇంట్లో మనిషి అస్థిపంజరం ఉండటం కలకలం రేపింది. హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలోని నాంపల్లి మార్కెట్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఏడేళ్లుగా ఆ ఇంటిలో ఎవరూ లేరని.. యజమాని విదేశాల్లో ఉన్నారని స్థానికులు తెలిపారు. అస్థిపంజరం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్ అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించింది. ఇటీవల ఓ యువకుడు శిథిలావస్థలో ఉన్న ఆ ఇంటిలోకి వెళ్లినట్లు సమాచారం. లోపల అస్థిపంజరాన్ని వీడియోలో రికార్డు చేశాడని.. అది వైరల్ కావడంతో యువకుడిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. క్రికెట్ బాల్ ఆ ఇంట్లో పడటంతో తీసుకునేందుకు వెళ్లానని యువకుడు తెలిపినట్లు సమాచారం.

# బిసి రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తిడి తెండి

**బిజెపి నేతలకు మంత్రి పొన్నం డిమాండ్**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించడంలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర భాజపా నేతలపై ఉందన్నారు. రాష్ట్రపతితో ఆమోదింపజేసి.. 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గం లేదా అఖిలపక్షం దిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాలో ఉన్న బీసీ నేతలు వాళ్ల అధిష్ఠానంపై ఒత్తిడి పెంచాలి. బీసీల రిజర్వేషన్లకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి. రిజర్వేషన్లపై భాజపా నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. తెలంగాణలో కులగణన చూసిన తర్వాతే కేంద్రం కళ్లు తెరిచింది. రాష్ట్ర ఒత్తిడితోనే కేంద్రం జనగణనతో పాటు కులగణనను ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# సంపాదకీయం

## అప్పులు చేసిన వారికి శిక్షలు లేవా ?

గత పాలకుల ధోరణి కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పులకుప్పగా మారింది. విభజన వల్ల జరిగిందిదే. రెండు కుటుంబాలు బాగు పడ్డాయి. రాష్ట్రాలు మాత్రం నీరసించాయి. ఈ అప్పులకు వడ్డీలు కట్టలేక మళ్లీ మళ్లీ అప్పులు చేస్తున్నారు. అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామని చెప్పిన కెసిఆర్, జగన్ ఇద్దరూ రాష్ట్రాలను దివాళా తీయించారు. దీనికి కేంద్రంలోని బిజెపి కూడా ఓ కారణం. అప్పులకుప్పగా రాష్ట్రాలు మారుతున్నా చోద్యం చూసిన మోడీ ప్రభుత్వం.. ఇప్పుడు నీతి వాక్యాలు పలుకుతోంది. తెలంగాణలో అయితే బిజెపి నేతలకు వేరే పనేమి లేనట్లుగా విమర్శలతో కాలయాపన చేస్తున్నారు. కేంద్రంలో అంతా బ్రహ్మాండంగా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ కాలం గడిపేస్తున్నారు. అప్పులు చేయకుండా రాష్ట్రాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇలా పాలకులు ఇష్టానుసారం అప్పులు చేసి వెళితే దాని బాధ్యత ఎవరిదన్న చర్చ చేయాలి. జీతాలు సకాలంలో ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేసామనుకుంటున్న కెసిఆర్, జగన్‌లు కళ్లు తెరిపించాలి.

అసవరమైతే అందుకు వారిని బాధ్యులను చేయాలి. చేసిన అప్పులకు శిక్షలు పడేలా చేయాలి. ఇకముందు రాజకీయ పార్టీలు, నేతలు ఇలా బాధ్యతా రహితంగా వ్యవహరించకుండా కట్టడి చేయాలి. ఇప్పటికైనా పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని పాలకులు గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే పద్ధతులు ఇకనుంచి పోవాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇకపోతే వీరు చేసిన అప్పులకు తోడు మరిన్ని అప్పులు చేస్తున్నారే తప్ప ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు పద్ధతి మార్చుకోవడం లేదు. వడ్డీలు కట్టలేక పోతున్నామని ఇద్దరు సిఎంలు అంటున్నారే తప్ప ఖర్చులు తగ్గించుకోవడం లేదు. ఏ రకంగా ఆదాయం పెంచుదామా, ఎలా ప్రజల నడ్డి విరుద్దామా అన్న ఆలోచనలే తప్ప..దుబారా పథకాలకు కళ్లెం వేయడం లేదు. సన్నబియ్యం అంటే కిలో రూపాయి బియ్యం, పెన్షన్లలో బోగస్ లబ్ధిదారులను ఏరివేసే కార్యక్రమం చేయడం లేదు. ఇకపోతే విభజన వల్ల రెండు తెలుగు రాష్ట్రాలను కోలుకోకుండా చేసిన ఘనత కెసిఆర్, జగన్‌లకే దక్కుతుంది. ఈ ఇద్దరి కారణంగా విభజన లక్ష్యం వెనక్కి పోయింది. ఇద్దరూ గోబెల్స్‌ను మించి అభివృద్ధి పేరుతో అతిగా ప్రచారం చేశారు.

ఇప్పుడేమో వాటిని మరచిపోయేలా ప్రజల్లో మళ్లీ సానుభూతి పొందేలా ఎదురుదాడి విమర్శలకు దిగుతున్నారు. సిగ్గూ ఎగ్గూ లేకుండా చేస్తున్న విమర్శలు చూస్తే మతిపోతుంది. ఇటు కెటిఆర్, హరీష్ రావు, కవితలు, అటు జగన్ ఆయన పరివారం అబద్దాల మూటలతో ప్రజలను వంచించే పనిలో పడ్డారు. ఎపిలో కనీసం 14.70 లక్షల కోట్లు అప్పుపెట్టి పోయారు జగన్ మహాశయులు. తెలంగాణలో కూడా ఏడులక్షల కోట్లను అప్పుగా పెట్టి పోయారు కెసిఆర్. ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా పాలన సాగించారు. అప్పులనుచి ఇప్పటి కిప్పుడు బయటపడడం సాధ్యం కాదు. రైతుభరోసా విషయంలో ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రభుత్వం సరైన అడుగులు వేస్తోంది. అర్హులకే ఇవ్వడంతో పాటు, గతంలో అప్పనంగా రైతుబంధు సాయం పొందిన వారి జాబితాను సిద్ధం చేస్తోంది. దాదాపు 25వేల కోట్లు వృధా అయినట్లు చెబుతున్నారు. ఇలాంటి దుబారాకు సంబంధించి నిక్కచ్చిగా వ్యవహరిం చాల్సిందే. ఎందుకంటే ఆస్తుల మాట ఎలా ఉన్నా ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. కొత్త కొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పలు చేసామని తెలుగు వల్లభులు కెసిఆర్, జగన్‌లు చాటుకున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేసారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెట్టారు. కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నా.. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబులకు పట్టడం లేదు. ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి..ఎంతమంది పేదలు ఉన్నారు.. ఎంతమంది కిలో బియ్యం వాడుతు న్నారన్నది గమనించడం లేదు. బియ్యం పక్కదారి పట్టి అమ్ముకుంటున్నా పట్టించుకోవడం లేదు. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది.

ఉచిత విద్యుత్ కూడా ఇప్పుడు ఆందోళనలకు కారణం అవుతోంది. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయాలి. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్న ప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం వేరన్న పద్దతిలో పాలన సాగాలి. రైతుభరోసా కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రం.. ప్రజలే అని గుర్తించాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగించిన ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు, ఉచిత గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల ద్వారా లక్షల కోట్లు దుర్వినియోగం అయ్యాయి.

విపక్షాలు కూడా విమర్శలు మాని ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టడానికి సహకరించాలి. మంచి సూచనలు ఇవ్వాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యులు కాగలరు. ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్కగట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగు పడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరిపాలన అందించిన వారం అవుతాం.ప్రజలకునేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించక పోవడం సరికాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు. బొక్కసం వెక్కిరించేలా చేయడం వల్ల..అప్పులు చేయడం వల్ల భవిష్యత్ తరానికి కోలుకోలేని దెబ్బ తగలగదని గుర్తించాలి.

# ప్రజల్లో ఆదరణ కోల్పోయిన పార్టీలు

**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :**

ప్రజల్లో ఆదరణ కోల్పోతున్నా..ఎదురుదాడి విమర్శలతో పాతకాపులు మళ్లీ బయలుదేరారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా మార్చి, కుటుంబ సక్షేమమే ప్రజల సంక్షేమంగా మార్చిన నేతలు మళ్లీ ప్రజల్లో ఆదరణ కోసం నానా తంటాలు పడుతున్నారు. తెలుగు రాష్ట్రాలను ఒకప్పుడు నిరంకుశంగా ఏలిన జగన్, కెటిఆర్‌లు సుద్దులు చెబుతున్నారు. అటు అధికారం లేక, ఇటు విపక్షంగా రాణించలేక, మిగతా విపక్షాలతో కలవలేక విసిరివేయబడ్డ వీరు ఉనికి కోసం నానా తంటాలు పడక తప్పడం లేదు. వీరి చరిత్ర చూస్తే మరోమారు వీరికి ప్రజలు అధికారం కట్టబెడతారన్న నమ్మకం మాత్రం లేదు. జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనుకుని నానా హడావిడి చేసిన కెసిఆర్ ఇప్పుడు ఒంటరి అయ్యాడనే చెప్పాలి. విపక్ష పార్టీలు కూడా కెసిఆర్‌తో కలవాలని కానీ లేదా కలుపుకోవాలని కూడా కోరుకోవడం లేదు. ఈ కోవలో జగన్ కూడా ఉన్నారు.

బిఆర్ఎస్ ఏర్పాటు తరవాత అడపాదడపా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం కెసిఆర్ కొంత హడావిడి చేశారు. కెసిఆర్ గతంలో కలసి చర్చించిన విపక్ష నేతలంతా ఇప్పుడు కెసిఆర్ వైపు చూడడం లేదు. వారంతా కాంగ్రెస్‌కు దగ్గరగా కూటమిలో ఉన్నారు. అలా కొందరు అధికార బిజెపికి దగ్గరగా కూడా వున్నారు. మొత్తానికి ప్రజలతో పాటు, ఇతర పార్టీలు కూడా కెసిఆర్, జగన్‌ను దూరం పెట్టారు. నితీశ్ కుమార్ వ్యవూహాత్మకంగా బిజెపికి దగ్గరయి ఎన్‌డిఎలో భాగస్వామి అయ్యారు. జగన్, కెసిఆర్‌లను బిజెపి కోవర్టులుగా మిగతా పార్టీల నేతలు భావిస్తున్నారు. అందుకే బిజెపికి వ్యతిరేక కూటమిలో వీరికి స్థానం దక్కడంలేదు.

ఈ క్రమంలో జాతీయ పార్టీని ఏర్పాటు చేసి జాతీయ రాజకీయాల్లో క్రియా శీల పాత్ర పోషించాల నుకున్న కేసీఆర్ అధికారం పోవడంతో పాటు, ఉన్న నేతలంతా జారుకోవడంతో ఇప్పుడు తెలంగాణ రాజ కీయాల్లో ఏకాకి అయ్యారు. కేవలం ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. ప్రజల్లోకి వచ్చి పోరాటాలు చేసే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. ఆయన బాధ్యత లను ఇప్పుడు కొడుకు కెటిఆర్, అల్లుడు హరీష్, కూతురు కవిత మోస్తున్నారు.తన నాయకత్వం కోసం దేశమంతా ఎదురుచూస్తోందని తెలంగాణ ప్రజలను నమ్మించే ప్రయత్నాలను ముమ్మరంచేసినప్పుడు కూడా కెసిఆర్‌ను ప్రజలు నమ్మలేదు, రైతులు, రైతు నాయ కుల పేరిట ఆ మధ్య ఉత్తరాదికి చెందిన కొంతమం దిని సొంత ఖర్చులతో రప్పించు కొని అతిథి మర్యా దలు చేసి వారంతా తన నాయకత్వాన్ని కోరు కుంటు న్నారని ప్రకటించారు.కాలం చెల్లిన కొందరు నేతలు వచ్చి కెసిఆర్‌ను కలిశారు. ఇప్పుడిదంతా చూస్తుంటే కెసిఆర్ భావి ప్రధాని కాబోతున్నారన్న హడావిడి చేశారు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది.

కర్ణాటకలో కుమార స్వామికి బలం లేదని మొన్నటి ఎన్నికల్లో ప్రజలు తేల్చేశారు. దీంతో ఆయన ఉనికి కోసం బిజెపి పంచన చేరి కేంద్రమంత్రి అయ్యారు. కేసీఆర్ నాయకత్వాన్ని అంగీక రించి





**ఈ ఇద్దరినీ ప్రజలు ఆదరించడం కష్టమే**

,ఆయన నాయక త్వంలో ప్రతిపక్షాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయ త్నాలు బెడిసి కొట్టాయి. కెసిఆర్ దేశానికి ప్రధానమంత్రి ఎందుకు కాకూడదని బిఆర్ఎస్ నేతలు ఊరూరా ప్రచారం చేసి బొకకబోర్లా పడ్డారు. కెసిఆర్ రంగు తెలియడంతో ఎన్నికలకు ముందే కమ్యూని స్టులు కూడా జారుకున్నారు.

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమం టే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా కమ్యూనిస్టులు పూర్తిగా బలహీన పడ్డారు. బెంగాల్లో కూడా ఎక్కడా పెద్దగా ప్రభావం లేదు. ఒకప్పుడు కమ్యూనిస్టులకు పెట్టని కోటగా ఉన్న పశ్చిమబెంగాల్లో ఇప్పుడు ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ తొమ్మి దేళ్లలో కేసీఆర్‌కు ఎంతో మంది ఆప్తులను, ఉద్యమ నేతలను దూరం పెట్టారు. కేంద్రంలో అధికా రంలో ఉన్న భారతీయ జనతా పార్టీతో పోల్చితే ప్రతి పక్షా లన్నీ ఆర్థికంగా బలహీనంగా ఉన్నాయి.ఉచిత విద్యుత్, ఉచిత మంచినీరు వంటి నినాదాలతో దేశ ప్రజలు అందరినీ తన వైపు తిప్పుకోగలనని కేసీఆర్ నమ్మారు. అందుకే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అన్న నినాదం లేవనెత్తారు. దేశవ్యాప్తంగా రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని తాను చేసిన ప్రకటనకు విశేష స్పందన వచ్చిందని ప్రచారం చేయించుకున్నారు.

మొత్తంగా మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో జీరోతో డరౌట్ అయ్యారు. ఇప్పుడు మరోమారు తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను నమ్మించ వచ్చని అనుకుం టున్నారు. తెలంగాణ ఏర్పాటుతో సెంటిమెంట్ ఇక ఏమాత్రం పనికిరాదని కెసిఆర్ గ్రహించలేక పోయారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాం క్షలు పెద్దగా నేరవేర లేదనే అభిప్రాయం చాలా మందిలో బల పడింది. అందుకే కెసిఆర్‌ను ఓడించారు. ఎపి లోనూ జగన్ స్వయం కృతంతో దెబ్బతిన్నారు. వైకాపా అధినేత, ఎపి మాజీ సిఎం మారోమారు ప్రజలతో మమేకం కావాలని చూస్తున్నారు. రైతులకు పరా మ ర్శల పేరుతో అలజడి సృష్టిస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదు. రాజకీయం చేయ డం ద్వారా పబ్బం గడుపుకుని, మళ్లీ ప్రజల్లో సాను భూతి కోసం యత్నిస్తున్నారు. ఈ క్రమంలో తనతో పాటు, పార్టీ నేతలు అనవసర రాద్దాంతం చేస్తూ దుమ్మెత్తి పోయడం అలవాటుగా చేసుకున్నారు.

గతంలో పాదయాత్రతో నేనున్నాను.. నేను విన్నా ను అని నమ్మబలికి నట్టేట ముంచినందుకు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పారు. మీరు వినలేదని గుర్తించామని ప్రజ లు చెప్పారు. పక్కనే ఉన్న అమరావతి రైతులు ఐదేళ్లుగా ఆందోళనలు చేసినా ఏ ఒక్కనాడూ పలకిరించిన పాపాన పోలేదు. రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడిపిస్తూ దోపి డీలు చేస్తున్నా మిన్నాకున్నారు. ఈ క్రమంలో అధికారం పోవడంతో జ్ఞానో దయం అయిన జగన్ ఇప్పుడు మళ్లీ ప్రజలకు చేరువ కావాలని చూస్తున్నారు. ప్రజలతో మమేకం అయ్యేం దుకు సిద్ధమవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశమైన ఆయన పార్టీ ఓటమి సంబంధించి నేతలకు భరోసాను కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేశామని, కానీ ఎందుకో ఓడి పోయామంటూ వెల్లడించారు.

ప్రజల్లో ఉంటూ ప్రజలకు మంచి చేసే ప్రయత్నం చేయడం ద్వారా మళ్ళీ అధికారాన్ని దక్కించుకుంటా మన్న భరోసాను కల్పించారు. ఆ ప్రకాశం, పల్నాడు, చిత్తేరు. పులివెందులలోనూ జగన్ పర్యటించారు. మొన్నటి వరకు తాడేపల్లి చుట్టూ ముళ్ల కంచెలను నిర్మించారు. ఎవరు కూడా చూడడానికి కూడా రాకుండా చేసుకున్నారు. అధికారం పోవడంతో ఇక ప్రజల అవసరం తెలిసి వచ్చినట్లు ఉంది. ప్రతిరోజు ప్రజలను కలిసేందుకు జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకమైన ఏర్పాట్లను చేయించారు. అదికారంలో ఉండగా వివిధ కేసుల్లో ఇరుక్కున్న వారిని న్యాయ పరమైన, ఆర్థిక పరమైన సహకారాన్ని అందించేం దుకు అనుగుణంగా చర్యలు తీసుకునేలా హామీ ఇస్తున్నారు. ఈ ఇద్దరూ రాజకీయంగా కోలుకోవడం ఇప్పుడు కష్టమనే చెప్పాలి.

# తెలంగాణ పట్ల వివక్ష మానండి

- వినతిపత్రాలపై దృష్టి పెట్టండి
- బిజెపి నేతలకు వేణుగోపాలాచారి సూచన

**ఆదిలాబాద్, నేటి ప్రభాత సూర్య :**

బిజెపి నేతలు ఇక్కడి పాలనపై విమర్శలు మాని కేంద్రం నుంచి సాయం అందించే పనులు చేయాలని కేంద్రమాజీ మంత్రి, కాంగ్రెస్ నేత డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అన్నారు. రాజకీయాలకు ఇది సమయం కాదని బిజెపి నేతలు గుర్తించాలని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాల గురించి వారు పోరాడితే మంచిదని అన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలో దీనిపై దృష్టి పెట్టాలని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై స్పష్టమైన హామీని ఇవ్వడం ద్వారా ప్రజల్లో పేరు సంపాదించుకోవాలని అన్నారు. అనేక పథకాలకు సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి పలుమార్లు కలసి వినతి పత్రాలు సమర్పించినా వాటిపై చర్యలు లేవన్నారు. ఖాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ,ఐటిఐఆర్ బయ్యారం ఉక్కు తదితర హామీల విషయంలో కేంద్రం మాట తప్పిందని అన్నారు. కేంద్రం నీతి ఆయోగ్ ఏర్పాటు చేసినప్పుడు చేసిన ప్రకటనలకు తాజాగా అనుసరిస్తున్న విధానాలకు పొంతన లేకుండా ఉందన్నారు. ఇప్పటికే సిఎం, మంత్రులు పలుమార్లు ఢిల్లీలో ప్రధానిని, కేంద్రమంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారని అన్నారు. అవన్నీ సాధించాలని సూచించారు. నిధుల విడుదలలో తెలంగాణకు అన్యాయం జరుగుతోం



దన్నారు. బిజెపి ఎంపిలు కూడా తప్పుదోవ పట్టించడం తగదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని వారు గుర్తించాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్రం తెలంగాణపై చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇప్పటికైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని సూచించారు.



# పూజలు సక్రమంగా జరిపించడం లేదు

### రంగంలో భవిష్యవాణి మాతంగి స్వర్ణలత

**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాత రలో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించారు.ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. రాబోయే రో జుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్ని ప్రమా దాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని భక్తులను హెచ్చరించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని చెప్పారు. బాల బాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాని చెప్పారు. కాలం తీరితే ఎవరు ఏది అనుభవిం చాలో అది అనుభవిస్తారని,తాను అడ్డురానని పేర్కొ న్నారు. 'బోనాల జాతరకు సంతోషంగా సాకలు పోసి బాగా చేశారు. ప్రతీసారి చేసినట్టే ఈ సారి కూడా పొరపాటు చేశారు. ప్రతి సంవత్సరం చెబు తునా.. నా బిడ్డలను కడుపులో పెట్టుకొని కాపాడు కుంటాను. నా పూజలు అన్ని సక్రమంగా జరిపిం చాలి. వేల రాసులు నేను రప్పించుకుంటున్న. నాకు రక్తం బలి ఇవ్వడం లేదు. మీరు మాత్రం ఆరగిస్తారు. నాకు మాత్రం ఇవ్వడం లేదు.. నాకు సరిగ్గా పూజలు చెయ్యకపోతే రక్తం కక్కుకొని చస్తారు.నాకు పూజలు సరిగ్గా జరిపించడం లేదు.. అందుకే మరణాలు పెరుగుతున్నాయి. ఆ విషయం లో అడ్డుపడను. నాకు రక్తం బలి కావాలి. నన్ను కొలిచే వారికి ఎప్పుడు తోడుగా నిలబడుతాను. రాబోయే రోజుల్లో మహమ్మారి వస్తుంది. ప్రజలు జాగ్రత్త ఉండాలి. అగ్ని ప్రమాదాలు బాగా జరుగు తాయి. ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా కురుస్తాయి. ఐదు వారాలు పాటు నాకు పూజలు, సాక పోసి ఆనంద పరచాలి. నాకు రక్తం చూపిం చండి లేకపోతే అల్లకల్లో లం జరుగుతుంది.నా రూపాన్ని పెట్టడానికి కూడా అడ్డుపడుతున్నారు.' అని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

# పశుపక్ష్యాదులను చూసి నేర్చుకోవాలి !



**తిరుమల, నేటి ప్రభాత సూర్య :**

అన్ని జన్మలకన్నా మానవ జన్మ ఉత్కృష్టమైనదంటారు. మాట్లాడ గల గడం వల్లనే అలా అని ఉంటారు. మిగతా జంతుజాలంతో పోలిస్తే మనావుడికి మాట్లాడడం, ఆలోచించడం వంటి ఉన్నత లక్షణాలు ఉన్నాయి. పశుపక్ష్యాదుల్లోనూ ఎన్నో ప్రత్యేకతలు న్నాయి. సాటి ప్రాణికి సాయపడటం, ఆపదలో ఆదుకోవడం, అండగా నిలబడటం, ఆసరా కావడం లాంటివి చూడవచ్చు. కొన్ని సమయాల్లో పశుపక్ష్యాదుల్లో జన్మతః వచ్చే లక్షణాలు అరుదైనవిగా చూస్తాం. మనిషితో పోలిస్తే అవి ఎంతగా పరిణతితో ఉంటాయన్నది గమనించవచ్చు. ఒక కాకి మరణిస్తే ఎన్నో కాకులు చుట్టూ చేరతాయి. ఒక చీమ చనిపోతే మరో చీమ మోసుకుపోతుంది. ఒక పక్షి పెట్టిన గుడ్డును మరో పక్షి పొదిగి పిల్లల్ని చేస్తుంది. అలా చేసినందుకు అవి ఏ ప్రతిఫలాన్నీ ఆశించవు. కానీ బుద్ధిజీవి అనిపించుకున్న మానవుడు అలాంటి సేవలు చెయ్యాలంటే ప్రత్యేకంగా అలవాటు చేసుకోవాలి. లేదా ఇతరులెవరైనా ప్రేరణ కలిగించాలి. ఈ రెండూ కాకపోతే ఆ పని చెయ్యడం వల్ల కొంత ప్రతిఫలమైనా ఉండాలి. ఇది ఎంతవరకు సమంజసమో ఎవరికి వారే ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఉత్కృష్ట మైంది అనిపించుకున్న మానవజన్మ కలిగినందుకు అందరికీ ఉపయుక్తమై పనులు చెయ్యడానికి శ్రద్ధ చూపాలి. దీన్ని బాధ్యతా యుత ఆధ్యాత్మికత అంటారు. అప్పుడే మన జన్మకు సార్థకత ఉంటుంది. స్వార్థం లేకుండా సమాజం కోసం పాటుపడాలి.

## అనుభవ వైద్యుల సంఘం పరామర్శ





**నేటి ప్రభాతా సూర్య. ప్రతినిధి.మందమర్రి, జూలై 14:**
అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలరెడ్డి గారి కుమార్తె సమత గారు హాస్పిటల్ నుంచి ఇంటికి చేరిన నేపథ్యంలో, ఆమె ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు గ్రామీణ అనుభవ వైద్యుల సంఘం సభ్యులు సోమవారం ఆమెను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు సమత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పరామర్శలు తెలియజేశారు. సంఘం తరఫున వ్యక్తిగత శ్రద్ధతో నిర్వహించిన ఈ కార్యక్రమం హృద్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో అనుభవ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, పట్టణ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, ఖజానాదారు ఆయిల్ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు చింతల పోషన్న, గౌరవ ఉపాధ్యక్షులు గోవర్ధన్, సీనియర్ డాక్టర్ జనార్ధన్, మతిఖాన్, తిప్పని శ్రీనివాస్, ఇతర ప్రముఖులు ఆర్. వెంకటేశం, నారా లింగన్న, ముంజం నర్సయ్య, మెరుగు మల్లేశం, జోర్రిగల రవి, వేముల నర్సయ్య, రామంచి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్ పొందిన బత్తుల సరిత

### సామాజిక సేవలకుగాను ఘనత



**మందమర్రి, నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి జూలై 14:**
ఉత్తమ సామాజిక సేవలకుగాను మందమర్రికి చెందిన బత్తుల సరితకు గౌరవ డాక్టరేట్ బహూకరించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు సాంస్కృతి సేవా ట్రస్ట్ ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కార్యక్రమానికి పలువురు ప్రముఖ కళాకారులు, రచయితలు, సేవా కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నవారు హాజరయ్యారు. సామాజిక మార్పు కోసం నిరంతరం కృషి చేస్తూ, మహిళా సంక్షేమం, విద్య, ఆరోగ్య రంగాల్లో సేవలందించినందుకుగాను సరితకు ఈ గౌరవం దక్కింది. అవార్డు స్వీకరించిన అనంతరం ఆమె స్పందిస్తూ, "ఇది నాకు గౌరవంగా ఉండటంతో పాటు మరింత బాధ్యతను కలిగించింది. భవిష్యత్తులో మరింత శ్రద్ధగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటాను" అని తెలిపారు. ప్రాంతంలోని ప్రముఖులు, స్థానిక ప్రజలు ఆమెను అభినందిస్తూ సత్కరించారు. ఆమె విజయానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, యువతలో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించాలంటూ పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీసులు కళ్లెం! రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా



**మంచిర్యాల.నేటి ప్రభాతా సూర్య. ప్రతినిధి, జూలై 14:**
రాజన్న సిరిసిల్ల-మంచిర్యాల ప్రాంతాల్లో ఇటీవల జరుగు తున్న అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీసు విభాగం కఠిన చర్యలు తీసుకుంటోంది. రామగుండం కమిషనరేట్ పరిధిలో అక్రమ కార్యకలాపాలు, ఘర్షణలు, దాడులు పెరిగిన నేపథ్యంలో, రౌడీషీటర్లపై పోలీసుల నిఘా మరింత ముదురుతోంది.
మంచిర్యాల డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 234 మంది రౌడీషీటర్లు గుర్తించబడగా, వీరి కదలికలపై 30 ప్రత్యేక పోలీస్ బృందాలు నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు మం చిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. రాత్రి పూట గస్తీ విధులు ముమ్మరం చేయడంతో పాటు, పాత నేరస్థులు, గంజాయి నిందితులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. కమిషనర్ అంబర్ ఝా ఆదేశాల మేరకు ఈ చర్యలు చేప ట్టినట్టు ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ఏమాత్రం లోపం తలెత్తకూడదన్న ఉద్దేశంతో జిల్లా మొత్తం మీద కట్టు దిట్టమైన పహారా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పోలీ సులు ప్రజల సహకారంతో ముందడుగు వేస్తున్నారని, ఏవైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే తక్షణమే పోలీ సులకు సమాచారం ఇవ్వాలని డీసీపీ భాస్కర్‌విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టు జాడ క్రాంతి కుమార్‌కు జాతీయ మహానంది అవార్డు - 2025





**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి జులై 14:**
వరంగల్,తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లోని రామయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత భవ్యంగా జరిగింది. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష కృషి చేసిన ప్రతిభావంతులను ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా, మందమర్రి పట్టణానికి చెందిన టైమ్స్ ఆఫ్ వార్త జర్నలిస్టు జాడ క్రాంతి కుమార్ 'ఉత్తమ జర్నలిస్టు' విభాగంలో జాతీయ మహానంది అవార్డు - 2025 అందుకుని విశేషంగా ఆకర్షించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ అవార్డు జర్నలిస్టు వృత్తికి గౌరవాన్నిస్తోందని పలువురు వ్యాఖ్యానించారు.
కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బట్టు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. అవార్డు అందజేసిన అనంతరం ఘన సన్మానం నిర్వహించగా, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.
ఈ సందర్భంగా మాట్లాడిన క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డు నాకు మరింత బాధ్యతను కల్పించింది. ప్రజలకు నిజమైన సమాచారం అందించేందుకు, వారి సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో నిబద్ధతతో ముందుకు సాగుతాను," అని చెప్పారు. క్రాంతి కుమార్‌కు జిల్లాలోని జర్నలిస్టులు, స్నేహితులు, బంధువులు, స్థానిక ప్రజలు హార్దిక అభినందనలు తెలిపారు. ఈ గౌరవం ద్వారా జిల్లా జర్నలిజానికి దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించిందని వక్తలు పేర్కొన్నారు.

## ఘనంగా లక్షెట్టిపేట ప్రభుత్వ హాస్పిటల్ ప్రారంభోత్సవం



### వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రుల శంకుస్థాపన, ప్రజల ఆశలకో చిరునామా



**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతా సూర్య. ప్రతినిధిజులై 14:**
లక్షెట్టిపేటలోని ప్రభుత్వ హాస్పిటల్ నూతన భవనాన్ని ఈరోజు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సోలార్ పవర్ ప్లాంట్, ఇండస్ట్రియల్ ఐటీ పార్క్ భూమి పూజ, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గౌరవ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, ఈఎండ్‌సీ, పరిశ్రమలు %డ% వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వైద్య, ఆరోగ్య, శాస్త్ర-సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. అలాగే మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ, చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యులు నూకల రమేష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, "అభివృద్ధి తాలూకు ఫలాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకూ అందాల్సిందే. ఆరోగ్యం, విద్య, పరిశ్రమల రంగాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. లక్షెట్టిపేట ప్రభుత్వ హాస్పిటల్ విస్తరణతో స్థానికులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానుంది," అని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ దార్ల సభను విజయవంతం చేయండి



**మందమర్రి, నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి జూలై 14:**
ఈనెల 17వ తేదీన మంచిర్యాల పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న 'చేయూత పింఛన్ దార్ల రాష్ట్ర స్థాయి సభను' ప్రతీ ఒక్కరు విజయవంతం చేయాలని వీహెచ్పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంధుల వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు వంటి సామాజికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలని కోరుతూ ఈ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలో ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పాల్గొంటారని ప్రకటించారు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు కనీసం రూ.4,000 పింఛన్, దివ్యాంగులకు రూ.6,000 ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం ఈ సభ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రాంతీయంగా జరిగే వివిధ సమస్యలను కూడా ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతి నిధులు, సామాజిక కార్యకర్తలు, పింఛన్ దారులంతా పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పాత కక్షల నేపథ్యంలో దాడి.. ముగ్గురు నిందితులు అరెస్ట్




**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి జులై 14:**
రామగుండం కమిషనర్ పరది లో పాత కక్షలు దృష్టిలో ఉంచుకుని పథకం ప్రకారం ఓ వ్యక్తిని హత్య చేయడానికి ప్రయత్నించిన ఘటన రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... కొత్త తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దుర్గం వెంకటేష్ %ూ/శీ% చిన రాయపోశం అనే వ్యక్తికి, అదే గ్రామానికి చెందిన కొమ్ము సంతోష్ %ూ/శీ% రాయలింగు తో గతంలో ట్రాక్టర్ల వ్యవహారంలో విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వెంకటేష్, తన తల్లిదండ్రుల సహాయంతో సంతోష్‌పై దాడికి పాల్పడ్డాడు.
తేది: 13-07-2025 రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో వెంకటేష్ ఫోన్ చేసి సంతోష్‌ను తన ఇంటికి పిలిపించాడు. సంతోష్ ఇంటికి రాగానే, వెంకటేష్ తండ్రి దుర్గం రాయపోశం కర్రతో అతని తలపై కొట్టగా, వెంకటేష్ తల్లి శారద సంతోష్ కాళ్ళు పట్టుకుంది. అనంతరం వెంకటేష్ ఇంట్లోంచి తీసుకొచ్చిన కత్తితో సంతోష్ ను పొడిచాడు. ఈ దాడిలో సంతోష్ కడుపు, వీపు మరియు చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి.
ప్రమాద స్థితిలో ఉన్న సంతోష్ ను ఆసుపత్రికి తరలించగా, తక్షణమే చర్యలు తీసుకున్న రామకృష్ణాపూర్ పోలీసులు వెంకటేష్, అతని తండ్రి రాయపోశం మరియు తల్లి శారదను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ముగ్గురినీ గౌరవ మంచిర్యాల న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని రామకృష్ణాపూర్ %ూ×% రాజశేఖర్ గారు తెలిపారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత






**మందమర్రి, నేటి ప్రభాతా సూర్య ప్రతినిది జూలై 14:**
"చదువే జ్ఞానం.. చదువే ధైర్యం.. చదువే లక్ష్యం... చదువే మన గమ్యం" అనే నినాదంతో 'అమ్మ ఆదర్శం యూత్ %-% మంచిర్యాల' సంస్థ ఆధ్వర్యంలో మేదరి బస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు మరియు స్కెచ్ పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 'అమ్మ ఆదర్శం యూత్' వ్యవస్థాపకులు బండారి రవికుమార్, జిల్లా సెక్రటరీ మంతెన సుమన్, సభ్యులు లింగంపల్లి శ్రీధర్, ఎనగందుల రజనీకాంత్, మంకాళి సతీష్, రత్నం సాగర్, కొనగంటి నరేందర్, చిలుక వెంకటేష్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహం అవసరమని, వారి భవిష్యత్ పై దృష్టి సారించే ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తూ సామాజిక సేవలో ముందుండే అమ్మ ఆదర్శం యూత్ కు పలువురు అభినందనలు తెలిపారు.

## గోదావరిలో నీరు లేక ఎడారి దృశ్యం



**మంచిర్యాల, నేటి ప్రభాతా సూర్య. ప్రతినిధి జూలై 14:**
వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా గోదావరిలో చుక్క నీరు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నిల్వ చేయకపోవడం, అలాగే ఎల్లంపల్లి నుంచి విడుదల లేకపోవడం కారణంగా నదిలో నీటి కొరత ఏర్పడింది. దీంతో సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తున్నారు. గోదావరి ఎడారిని తలపిస్తుండడం గమనార్హం.

## చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**జూలై 14, 2025, , నేటి ప్రభాత సూర్య**
ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని కన్నెపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మల్లేష్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామ శివారులోని చెట్టు వద్ద ఆయన మృతదేహాన్ని స్థానికులు సోమవారం ఉదయం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.
పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మల్లేష్ గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**డి పి ఓ, రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కి వినతి పత్రం అందజేత**

**ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠినమైన చర్యలు**



**యాచారం నేటి ప్రభాత సూర్య (జులై 14):**
ప్రభుత్వ భూములను, ఖాళీ స్థలాలను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ ( డీపీఓ) అన్నారు. సోమవారం మండల పరిధిలో గునుగల్ గ్రామములో సర్వేనెంబర్ 602/%ూ,602/జు%, లో శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో వెంచర్ లో ఖాళీ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఆక్రమించారని, రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, ఇబ్రహీంపట్నం రిజిస్టర్ ఆఫీసర్ సోనికి , అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని పిఏసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బీమ్ యాదవ్, వి ఎస్ ఎస్ చైర్మన్ కుంటి నరసింహ, బీఎస్పీ నాయకురాలు కంబాలపల్లి శాంత, సిపిఎం నాయకులు ఎస్సార్ ఆంజనేయులు, వినతి పత్రం అందించారు. వెంటనే అధికారులు స్పందించి ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జాకు పాల్పడితే వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అచ్చన్న రమేష్, సీనియర్ నాయకులు అచ్చన్న భాష, ఆవ జంగయ్య, కాల్వ శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక లాభాలను తెచ్చిపెట్టే ఆయిల్ ఫామ్ పంటలను రైతులు సాగు చేసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ -నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (జులై 14)**

రంగారెడ్డి జిల్లా పచ్చబడితే తెలంగాణ మొత్తం రంగారెడ్డి పచ్చబడుతుందని, 40 ఏళ్ల వరకు డోకా లేని, లాభాలు తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ పంటలను రైతులు సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సోమవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోని పెద్దవీడు గ్రామంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్యలతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఎవరూ భూములు అమ్ముకోవద్దని, పంటలు వేసుకోవాలని, తద్వారా వర్షాలు సమృద్ధిగా కురవడంతోపాటు సంతృప్తినిస్తుందని రైతులకు మంత్రి వివరించారు. ఇప్పటి వరకు 3 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగవుతోందని, ఈ సంవత్సరం మరో మూడు వేల ఎకరాలు పెరగాలని ఆయన అన్నారు. కంపెనీ వారే మీ తోటలోకి వచ్చి పంటను సేకరిస్తారని, ధర, రవాణా వంటి ఇబ్బందులు కూడా ఉండవని, కొనుగోలు వేసిన వెంటనే రైతుల ఖాతాలలోకి డబ్బును జమ చేస్తారని మంత్రి తెలిపారు. మనకు వంద లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్ అవసరమని, ప్రస్తుతం మనం 3 లక్షలు పండిస్తున్నామని, దీంతో ఇతర దేశాల నుంచి లక్షన్నర కోట్లు పెట్టి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటసాగుకు వీలు ఉందని, కనీసం 10 నుంచి 15 లక్షల ఎకరాల్లో పంట వేసినా, దేశానికి మన రాష్ట్రం ఆయిల్ పామ్ సరఫరా చేయవచ్చున్నారు. రానున్న రెండు, మూడేళ్లలో రాష్ట్రం లోని ఉమ్మడి పది జిల్లాల్లో పది ఫ్యాక్టరీలను నిర్మించనున్నామని,




ఇందుకోసం పూర్తి అనుమతులు పొందడం జరిగిందని, వచ్చే నెలలో సిద్ధిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతులు ఆయిల్ పామ్ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారని, ఇప్పటికే 4 వేల ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ ఏకకాలంలో అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని, జిల్లాలో 2 లక్షల 83 వేల మంది రైతులకు 323 కోట్ల 50 లక్షలు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. అదే విధంగా రుణమాఫీ కింద ప్రతి రైతుకు రెండు లక్షల చొప్పున మాఫీ చేస్తూ జిల్లాలో 1 లక్షా 4వేల మంది రైతులకు రూ.747 కోట్ల 41 లక్షలు రుణ మాఫీ చేశామన్నారు. సర్దార్ నగర్ మార్కెట్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసిందని మహేందర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంధాలయ



సంస్థ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల డైరెక్టర్ యస్మిన్ బాషా, జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి సురేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో విజయమే లక్ష్యం

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొసుపల్లి ప్రతాప్.**



**ఆదిబట్ల- నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జులై 14)**
స్థానిక సంస్థల ఎన్నికలలోవిజయమే లక్ష్యంగా కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొసుపల్లి ప్రతాప్ కార్యకర్తలకు సూచించారు. అదిభట్ల మున్సిపాలిటీ బీజేపీ బూత్ కమిటీ ఆ పై స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం కొంగర కలాన్ లోని కల్యాకొలు లక్ష్మి దేవమ్మ ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు గజ్జల నర్సింహా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందని పేర్కొన్న ఆయన ప్రజల పక్షంగా ఉన్న బీజేపీ కి ఆదరణ పెరుగుతుందని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ జండా ఎగరడం ఖాయమని అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ లో బీజేపీ కి బలమైన నాయకత్వం కార్యకర్తల బలం ఉందని త్వరలో జరిగే స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యలు గుర్తించి ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు.ఇంకా బీజేపీ సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, పొట్టి రాములు, పండల లక్ష్మీపతి గౌడ్, ఉడుతల అశోక్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్, రవి చందర్ గుప్తా, శివ, వినయ్, హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 1502 ఫిర్యాదులు

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటి ప్రభాత సూర్య జులై14**
ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.
సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (152) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ- 130, ఇతర శాఖలకు - 22, మొత్తం



152 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హరి హర క్షేత్ర దేవాలయంలో ఆషాఢ గోరింటాకు వేడుకలు



**మంచిర్యాల నేటి ప్రభాతా సూర్య, జూలై 14 (ప్రతినిధి):**
మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీ హరి హర క్షేత్ర దేవాలయంలో సోమవారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మహిళలు స్వయంగా గోరింటాకును తయారు చేసి ఒకరికొకరు అలంకరించుకోవడం, కోలాటాలు ఆడటం, మంగళ గీతాలు పాడటం వంటి కార్యక్రమాలతో వేడుకలకు ప్రత్యేక అందాన్ని జోడించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణలు జరిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు పట్టణం నలుమూలల నుండి వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకలు సాంస్కృతిక ఉత్సాహాన్ని నెలకొల్పాయి.

# ఆయిల్ ఫామ్ పంటలను రైతులు సాగు చేసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ -నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (జులై 14)**
రంగారెడ్డి జిల్లా పచ్చబడితే తెలంగాణ మొత్తం రంగారెడ్డి పచ్చబడుతుందని, 40 ఏళ్ల వరకు డోకా లేని, లాభాలు తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ పంటలను రైతులు సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.సోమవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోని పెద్దవీడు గ్రామంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్యలతో కలిసి ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఎవరూ భూములు అమ్ముకోవద్దని, పంటలు వేసుకోవాలని, తద్వారా వర్షాలు సమృద్ధిగా కురవడంతోపాటు సంతృప్తినిస్తుందని రైతులకు మంత్రి వివరించారు. ఇప్పటి వరకు 3 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగవుతోందని, ఈ సంవత్సరం మరో మూడు వేల ఎకరాలు పెరగాలని ఆయన అన్నారు. కంపెనీ వారే మీ తోటలోకి వచ్చి పంటను సేకరిస్తారని, ధర, రవాణా వంటి ఇబ్బందులు కూడా ఉండవని, కొనుగోలు వేసిన వెంటనే రైతుల ఖాతాలలోకి డబ్బును జమ చేస్తారని మంత్రి తెలిపారు. మనకు వంద లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్ అవసరమని, ప్రస్తుతం మనం 3 లక్షలు పండిస్తున్నామని, దీంతో ఇతర దేశాల నుంచి లక్షన్నర కోట్లు పెట్టి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటసాగుకు వీలు ఉందని, కనీసం 10 నుంచి 15 లక్షల ఎకరాల్లో పంట వేసినా, దేశానికి మన రాష్ట్రం ఆయిల్ పామ్ సరఫరా చేయవచ్చున్నారు. రానున్న రెండు, మూడేళ్లలో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లో పది ఫ్యాక్టరీలను నిర్మించనున్నామని, ఇందుకోసం పూర్తి అనుమతులు పొందడం జరిగిందని, వచ్చే



నెలలో సిద్ధిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతులు ఆయిల్ పామ్ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారని, ఇప్పటికే 4 వేల ఎకరాల్లో పంటను సాగుచేస్తున్నారని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ ఏకకాలంలో అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని, జిల్లాలో 2 లక్షల 83 వేల మంది రైతులకు 323 కోట్ల 50 లక్షలు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. అదే విధంగా రుణమాఫీ కింద ప్రతి రైతుకు రెండు లక్షల చొప్పున మాఫీ చేస్తూ జిల్లాలో 1 లక్షా 4వేల మంది రైతులకు రూ.747 కోట్ల 41 లక్షలు రుణ మాఫీ చేశామన్నారు. సర్దార్ నగర్ మార్కెట్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసిందని మహేందర్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల డైరెక్టర్ యస్మిన్ బాషా, జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి సురేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కురుమేడు జెడ్పిహెచ్ ఎస్‌లో పిఆర్టియు టీఎస్ సభ్యత్వ నమోదు



**చింతపల్లి-నేటిప్రభాత సూర్య,జులై 14**
చింతపల్లి మండలం కుర్మెడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్ టియు టీఎస్ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి. సీనియర్ పి ఆర్ విటి ఎస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ,పీఆర్ టియు టి ఎస్ స్టేట్ అసోషియేట్ అధ్యక్షులు ఏపూరి మలేశం టీచర్ల సమస్యలను ప్రస్తావించారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి స్పందిస్తూ న్యాయ పరమైన చిక్కులు అంటే రిట్‌అపీల్ డబ్ల్యు ఏ క్లియర్ కాగానే తప్పకుండా వృత్తి విద్యా ఉపాధ్యాయులకు,రిటైర్డ్ అయిన వారికి పాత పెన్షన్, నోషనల్ సర్వీస్ ఆంధ్రా వృత్తి విద్యా ఉపాధ్యాయులకి ఇచ్చిన విధంగా తప్పకుండా ఇప్పిస్తానని, టీచర్ల సమస్యలు తప్పక నెరవేరుస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

# సిపిఐ జిల్లా మహాసభలకు ముస్తాబైన దేవరకొండ



**దేవరకొండ -నేటి ప్రభాత సూర్య (జులై 14 )**
సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ నేడు మంగళవారం దేవరకొండలో జరుగుతున్నాయి. దేవరకొండ పట్టణ మొత్తం జెండాలు తోరణాలు ఫ్లెక్సీలతో ఎరుపు మయంగా మారింది. చాలా సంవత్సరాల తర్వాత దేవరకొండలో జిల్లా మహాసభ జరుగుతున్న సందర్భంగా దేవరకొండ లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహ్మారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటున్నారని జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు ఈ మహాసభలలో రూపొందిస్తామని అన్నారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి ,ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని అన్నారు. ఎన్నో పోరాటాల చరిత్ర గల దేవరకొండ కిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరోచిత పోరాటాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. నల్లగొండ జిల్లా ప్రజల దీర్ఘకాలిక సమస్య అయిన సాగు తాగు నీటి సమస్య పరిష్కారం కోసం ఎస్ఎల్బీసీ సొరంగం ,డిండి లిఫ్ట్ ఎత్తిపోతలు త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పలుమార్లు ఎమ్మెల్యే గెలిచిన దేవరకొండ నియోజకవర్గం లో మరోసారి ఎర్రజెండా ఎగరవేయడం కోసం కోసం ఈ మహాసభలు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి సహాయ కార్యదర్శి నూనె రామస్వామి,పల్లా రంగారెడ్డి పట్టణ కార్యదర్శి వలమల ఆంజనేయులు, యాదయ్య,కే బారేములు, ముడీ రాజు, ఏ మల్లయ్య, శివకుమార్ వినోద్, మహేష్, వెంకట్ రెడ్డి, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ పట్ల ఆగ్రహం

**- వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా మొద్దునిద్ర వీడని రేవంత్ సర్కార్.**

**- ప్రభుత్వ విద్యను సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వం.**

**- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 1100 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురి అయ్యారు.**

**బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ -నేటిప్రభాతసూర్య, జులై14**
దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ పట్ల బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా రేవంత్ సర్కార్ మొద్దునిద్ర వీడడం లేదు అని ఆయన అన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో,గురుకుల పాఠశాలలో,హాస్టల్స్ నిర్వహణపై ఏమాత్రం శ్రద్ధ లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది అని అన్నారు.ప్రభుత్వ విద్యను సంక్షోభం లోకి నెట్టిన ప్రభుత్వం అని ఆయన తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1100 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురి అయ్యారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుప్పకూలిందని ఆయన అన్నారు.కాంగ్రెస్ అధికా



రంలోకి వచ్చాక విద్య వ్యవస్థను నీరు గారుస్తున్నారని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో 60 మంది విద్యార్థుల మరణించడం జరిగిందని, పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో విద్యార్థులను పొట్టన బెట్టుకుంటున్న ముఖ్య మంత్రి అని విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదు అని అన్నారు.రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిందని కేసీఆర్ హయాంలో విద్యావ్యవస్థ ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు.విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆయన కోరారు.రాష్ట్రంలో సంక్షేమ రంగం మొత్తం కూడా భ్రష్టు పట్టిపోయిందని విద్యా శాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యారంగంలో ఉన్నటువంటి గురుకుల, ఆశ్రమ , వసతి గృహాలు,ప్రభుత్వ పాఠశాలలు అన్ని రకాల విద్యాసంస్థలలో కనీస పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచారంగా తయారైందని ఆయన అన్నారు.గతంలో జరిగినటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో మరల విద్యా సంవత్సరం ప్రారంభం కావడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు కనీసం ఆశ్రమ పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించకపోవడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వాడుతున్నారని ఆయన ఆరోపించారు.

# ముంపు బాధితులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతా సూర్య. ప్రతినిధి జులై 14:**
హాజీపూర్.ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాల్లో నివసించే బాధితులకు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహార బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హాజీపూర్ మండల కేంద్రంలో సోమవారం నిరసన నిర్వహించబడింది.బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో బాధితుల బృందం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్రగా రతహసిల్దార్ కార్యాలయం వరకు వెళ్లింది. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముంపు బాధితులు ఇళ్లకు, భూములకు నష్టపోయినప్పటికీ, సంబంధిత పరిహార బకాయిలు ఇప్పటికీ వారికి అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రఘునాథ్ మాట్లాడుతూ, "ఏళ్లుగా ప్రభుత్వాలు మారినా ముంపు బాధితుల కష్టాలు తగ్గలేదు. వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించి ప్రజలకు న్యాయం చేయాలి" అని పేర్కొన్నారు.ధర్నాలో మంజుల, సుధాకర్, వెంకటేష్, రాజయ్య వంటి ముంపు బాధితులు పాల్గొన్నారు.



నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

# క్రీడారంగం



## విడాకులు తీసుకుంటున్న సైనా నెహ్వాల్

మరో స్టార్ సెలబ్రిటీ కపుల్ విడాకులు తీసుకుంటోంది. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. కశ్యప్, తాను విడాకులు తీసుకుంటున్నామని సైనా నెహ్వాల్ తన సోషల్ మీడియాలో ఈ విషయాన్ని తెలియజేశారు. బ్యాడ్మింటన్ కోర్టులో వీరిద్దరి ప్రేమ కథ ప్రారంభమైంది. వీరిద్దరూ హైదరాబాద్ లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో కలిసి శిక్షణ పొందారు. అకాడమీలో మొదలైన వీరి పరిచయం స్నేహంగా మారింది. అది ప్రేమగా మారి పెళ్లిపీటలెక్కింది. తమ విడాకుల ప్రకటనతో అభిమానులకు సైనా, కశ్యప్ షాకిచ్చారు. బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక నోట్ షేర్ చేశారు. "జీవితం కొన్నిసార్లు మనల్ని వేర్వేరు దారుల్లో నడిపిస్తుంది. చాలా ఆలోచించిన తరువాత నేను, నా భర్త పారుపల్లి కశ్యప్ విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాం. మేము ఒకరికొకరు పరస్పరం మానసిక ప్రశాంతతతో పాటు ఎంతో అభివృద్ధి చెందాలని, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని ఆకాంక్షిస్తున్నాం. ఇప్పటివరకూ ఉన్న చిరస్మరణీయ క్షణాలకుగానూ కృతజ్ఞతలు. మంచి భవిష్యత్తు ఉండాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ' సైనా పోస్ట్ చేశారు.

## సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్ ఆరోన్



ఐపీఎల్ 2026 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ సమయాత్తమవుతోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఎదురైన ఘోర పరాజయాల నేపథ్యంలో జట్టు ప్రక్షాళనపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బౌలింగ్ కోచ్‌ను మార్చింది. జేమ్స్ ఫ్రాంక్లిన్‌ను తప్పించి కొత్త బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను నియమించింది. ఈ విషయాన్ని సోమవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. 'మా కోచింగ్ విభాగానికి ఆజ్యం తోడైంది. మా కొత్త బౌలింగ్ కోచ్ వరుణ్ ఆరోన్‌కు స్వాగతం'అని సన్‌రైజర్స్ హైదరాబాద్ ట్వీట్ చేసింది. జార?ండ్‌కు చెందిన వరుణ్ ఆరోన్..అత్యంత వేగవంతమైన బౌలర్‌గా గుర్తింపు పొందాడు. 2011-2015 మధ్య భారత్ తరఫున 9 వన్డేలు, 9 టెస్ట్‌లు ఆడిన వరుణ్ ఆరోన్..29 వికెట్లు తీసాడు. వేగం అతని ప్రధాన బలం అయినప్పటికీ, తరచుగా గాయాల బారిన పడటం వరుణ్ ఆరోన్ కెరీర్‌పై ప్రభావం చూపింది. ఐపీఎల్‌లో 59 మ్యాచ్‌లు ఆడిన వరుణ్ ఆరోన్ 8.94 ఎనానమీతో 44 వికెట్లు పడగొట్టాడు.

## సిరాజ్‌కు రూ. 2.25 లక్షల జరిమానా!



టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) చర్యలు తీసుకుంది. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్‌లో సిరాజ్.. ప్రత్యర్థి ఆటగాడి పట్ల అనుచిత ప్రవర్తంచడాన్ని తప్పుబట్టిన ఐసీసీ.. రూల్స్ ప్రకారం అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.5 ప్రకారం సిరాజ్ మ్యాచ్ ఫీజులో రూ. 2.25లక్షలు కోత విధించింది. అయితే ఇది భారత ఆటగాళ్లకు లెక్కే కాదని నెటిజన్లు, మాజీ క్రికెటర్లు అంటున్నారు.

## ద్రవిడ్ భారీ రికార్డ్ బద్దలు

### చరిత్ర సృష్టించిన శుభమన్ గిల్



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రికార్డులు తిరగరాస్తున్నాడు. ఇదివరకే దాదాపు పది రికార్డులను తన ఖాతాలో వేసుకున్న గిల్ ఇంగ్లాండ్‌తో లార్డ్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న మూడో టెస్టులో రాహుల్ ద్రావిడ్ రికార్డును అధిగమించాడు. రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయడం ఛేజింగ్‌లో భారత జట్టుపై ఒత్తిడిని పెంచింది. అయితే, ఈ ఇన్నింగ్స్ ద్వారా రాహుల్ ద్రవిడ్ 23 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టాడు. ఇప్పుడు ఇంగ్లాండ్‌లో ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డ్ మిస్టర్ డిపెండబుల్ ద్రావిడ్ పేరట ఉండేది. మూడో టెస్టులో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేసర్ బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. కీలకమైన ఈ ఇన్నింగ్స్‌లో గిల్ కేవలం 6 పరుగులు చేశాడు. దీంతో ఈ టెస్ట్ సిరీస్‌లో గిల్ 607 పరుగులు చేశాడు. దాంతో ఇంగ్లాండ్‌లో ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఇంతకు ముందు ఈ రికార్డు రాహుల్ ద్రావిడ్ పేరిట ఉంది. ద్రావిడ్ 2002లో ఇంగ్లాండ్‌లో జరిగిన 4 మ్యాచ్‌లు 6 ఇన్నింగ్స్‌లలో మొత్తం 602 పరుగులు చేశాడు. ఇప్పుడు భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డుపై శుభ్‌మన్ గిల్ కన్నేశాడు. అతను టెస్ట్ సిరీస్‌లో తరువాత మ్యాచ్ లలో ఇది సాధించవచ్చు. ఇంగ్లాండ్‌పై టెస్ట్ సిరీస్‌లో గ్రాహం గూచ్ పేరిట అత్యధిక పరుగుల రికార్డ్ ఉంది. గ్రాహం గూచ్ 1990లో 752 పరుగులు చేశాడు.

## కేఎల్ రాహుల్ ఔట్‌పై గవాస్కర్ తీవ్ర అసంతృప్తి



క్రికెట్ లో డెసిషన్ రివ్యూ సిస్టమ్ అనేది అంపైర్ నిర్ణయాలపై స్పష్టతనిచ్చే ఒక ముఖ్యమైన సాధనంగా మారింది. అయితే, లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్‌ను అవుట్ చేసిన తీరుపై భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. మ్యాచ్‌లోని ఒక కీలక సందర్భంలో, కేఎల్ రాహుల్ ఇంగ్లాండ్ బౌలర్ బంతికి ఎల్బీడబ్ల్యూగా అవుట్ అయ్యాడు. ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు రివ్యూకు వెళ్లింది. డీఆర్ఎస్‌లో బంతి మిడిల్ స్టంప్‌ను తాకుతుందని చూపించడంతో రాహుల్‌ను అవుట్‌గా ప్రకటించారు. ఈ నిర్ణయంపై కామెంటరీ బాక్స్‌లో ఉన్న సునీల్ గవాస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. డీఆర్ఎస్‌లో బంతి ప్రయాణించిన తీరు, స్టంప్స్‌ను తాకిన వైనంపై ఆయన సందేహాలు వ్యక్తం చేశారు.



కన్నప్ప బ్యూటీ నటి ప్రీతి ముకుందన్

## ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

ఇటీవల వచ్చిన 'కన్నప్ప'తో ప్రేక్షకులకు మరింత చేరువ య్యారు నటి ప్రీతిముకుందన్. ఆ సినిమాలో కీలకపాత్రలో కనిపించిన అగ్ర కథానాయకుడు ప్రభాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ప్రీతి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్ అని అన్నారు. కన్నప్ప లాంటి భారీ ప్రాజెక్ట్‌లో అనుకోకుండా అవకాశం వచ్చింది. కొన్ని సార్లు మన ప్రమేయం లేకుండా ఇలాంటి పెద్ద సినిమాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. సవాలుగా ఉండే పాత్రలంటే నాకు ఇష్టం. అవి కష్టంగా ఉన్నప్పటికీ గుర్తింపు తెస్తాయి. అలాంటి పాత్రలు ఉంటే ఆడిషన్ ఇవ్వడానికి సిద్ధమే. కన్నప్పలో ప్రభాస్‌తో (సశశిరశ) కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ పాజి టివిటీ ఉంటుంది. ఆయన ప్రత్యేకత స్క్రీన్‌పై కూడా స్పష్టంగా కనిపించింది. నిజ జీవితంలోనూ ప్రభాస్ చాలా స్వీట్‌పర్సన్. ఆయన పాన్ ఇండియా స్టార్ అయినప్పటికీ సాధారణంగా ఉంటారు. ఎవరినీ చిన్నచూపు చూడరు. సెట్‌లో అందరినీ గౌరవిస్తారు' అని ప్రీతి ముకుందన్ చెప్పారు. మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప'లో ప్రభాస్ రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. వీరిద్దరి మధ్య సంభాషణలు సినిమాకే హైలైట్‌గా నిలిచి ఆకట్టు-కున్న విషయం తెలిసిందే. ఇక 'ఓం భీమ్ బుష్'తో టాలీవుడ్‌కు పరిచయమైన ప్రీతి ముకుం దన్ 'కన్నప్ప'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'మైనే ప్యార్ కియా'లో నటిస్తున్నారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

# సినిమా

## కొత్తపల్లిలో ఒకప్పుడు .. సాంగ్ విడుదల

ప్రవీణ పరుచూరి దర్శకురాలిగా పరిచయమవుతున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రంలోని 'రంగనాయకి' సాంగ్ లిరికల్ వీడియో రిలీజైంది. గ్రామీణ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ మెలోడీ సాంగ్ అభిమానులను అలరిస్తోంది.



## హరిహరవీరమల్లు రన్‌టైమ్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తాజా చిత్రం 'హరి హర వీరమల్లు'. ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ. దయాకర్ రావు భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి సంగీతం అందిన్నారు. ఇటీవల రిలీజ్ చేసిన హరిహర వీరమల్లు థియేట్రికల్ -ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. మొత్తం 162 నిముషాల అనగా రెండు గంటల 42నిమిషాల రన్ -టైమ్ తో యూ/ఎ సర్టిఫికెట్ తో ఫైనల్ వర్షన్ ను లాక్ చేసారని సమాచారం.

## సినిమా వదిలేస్తానని ఏడ్చేశా: నటి ఇలియానా

'దేవదాసు' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఇలియానా బ్యూటీ- తన అందంతో , నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాంతో ఈ మూవీ తర్వాత నుంచి ఈమెకు అదిరిపోయే రేంజ్ క్రేజీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. కానీ ఇండస్ట్రీలో హీరోయిన్ ల కెరీర్ గురించి తెలియంది కాదు.. అవకాశాలు వచ్చినట్లే వచ్చి ఆగిపోతాయి. ఇలియాన విషయంలో కూడా ఇదే జరిగింది. దీంతో ఈ అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ-ఇచ్చి అక్కడ కూడా మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రజంట్ ఇండస్ట్రీకి దూరంగా ఉండి.. తల్లి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇలియానా సినీ ప్రయాణంలో ఒక కీలక మలుపు గురించి పంచుకుంది..సినీరంగం బాహ్యంగా గ్లామరస్‌గా కనిపించినా, వాస్తవానికి చాలా ఒత్తిడులు, భావోద్వేగా లతో కూడి ఉంటుంది. ముఖ్యంగా 'దేవదాసు' సినిమా -టైమ్‌లో ఎదుర్కొన్న కష్టం ఎప్పటకి మర్చిపోలేను అని చెప్పుకొచ్చింది.



Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.